సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం। 25। డిసెంబర్। 2024



చీనీ టన్ను రూ.28,310

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.28,310, కనిష్టంగా రూ.12 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.17

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.17, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
30.5°/15.4°

జిల్లాలో చలి వాతావరణం కొనసాగుతోంది. మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రజలకు ఉషశ్రీచరణ్ క్రిస్మస్ శుభాకాంక్షలు



పెనుకొండ రూరల్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు, వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులకు, పార్టీ కుటుంబ సభ్యులు, ప్రభుత్వ అధికారులకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు కరుణతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

పండుగను సంతోషంగా జరుపుకోవాలి



రత్న, జిల్లా ఎస్పీ

పుట్టపర్తి టౌన్: జిల్లా ప్రజలకు ఎస్పీ రత్న క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. క్రీస్తు సూచించిన మార్గంలో అందరూ నడవాలన్నారు.

పర్యాటక కేంద్రాల అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ చేతన్ వెల్లడి



అమగొండపాళ్యం కొండ హిల్‌వ్యూ పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్, అధికారులు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో పర్యాటక కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. మంగళవారం ఆయన జిల్లా ఫారెస్ట్ అధికారి చక్రపాణితో కలిసి పుట్టపర్తి మండలం అమగొండపాళ్యం సమీపంలోని సత్యసాయి ఎకో పార్కు, అభయారణ్యం, పర్యాటక శాఖ అభివృద్ధి చేస్తున్న పర్యాటక స్థలం, హిల్‌వ్యూ పాయింట్లను పరిశీలించారు. సమీపంలో ఉన్న చంద్రాయనికుంటనూ పరిశీలించారు. అధికారులు తయారు చేసిన మ్యాప్‌ను పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు చూసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అతిథి గృహం నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రముఖ దర్శనీయ స్థలాలన్నీ ఒకేసారి సందర్శించడానికి వీలుగా రూట్ మ్యాప్ తయారు చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ యామిని సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

లేపాక్షి ఎంజేపీ విద్యార్థికి అరుదైన అవకాశం

- ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపునకు ఎంపిక



మహేంద్ర

లేపాక్షి: స్థానిక జ్యోతిబా పూలే ఏపీ గురుకుల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న చెక్కా జోగి మహేంద్రకు అరుదైన అవకాశం లభించింది. ఢిల్లీలో జరిగే ప్రీరిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక చేస్తూ అధికారులు మంగళవారం సమాచారం ఇచ్చారు. నృత్యం, యోగా ప్రదర్శన విభాగాల్లో ఎంపికైన జోగి మహేంద్ర ప్రీరిపబ్లిక్ డే పరేడ్‌లో ప్రతిభ కనబరిస్తే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే అవకాశం దక్కుతుంది. నృత్య, యోగా ద్వారా సాంప్రదాయ, సాంస్కృతిక వైభవాన్ని చాటే జోగి మహేంద్ర తప్పకుండా రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపికవుతాడని ప్రిన్సిపాల్ సుందరరాజు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అరుదైన అవకాశం రావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యార్థిని అభినందించారు.

2, 3 తేదీల్లో కరువు బృందం పర్యటన



జొన్నలకొత్తపల్లి వద్ద పొలాలను పరిశీలిస్తున్న డీఏఓ ఎస్వీ సుబ్బారావు

ముదిగుబ్బ: పంట నష్టం అంచనా వేసేందుకు జనవరి 2, 3 తేదీల్లో కేంద్ర కరువు బృందాలు జిల్లా పర్యటన వస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) ఎస్వీ సుబ్బారావు తెలిపారు. అందులో భాగంగా మంగళవారం ఆయన కేంద్ర బృందం పరిశీలన కోసం పొలాలను ఎంపిక చేయడానికి సంకేపల్లి, జొన్నలకొత్తపల్లి గ్రామాల్లో పర్యటించారు. దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. డీఏఓ వెంట వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

శుభోదయం.. క్రీస్తు జన్మదినం



హిందూపురంలోని దుకాణంలో క్రిస్మస్ స్టార్లు

శాంతి, ప్రేమ, కరుణతో మానవాళికి శుభసందేశమందించిన కరుణామయుడి జన్మదిన వేడుకలకు జిల్లా ముస్తాబైంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లోని చర్చీలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించగా జిల్లా అంతటా క్రిస్మస్ శోభ వెల్లివిరుస్తోంది. క్రిస్మస్ సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్‌లన్నీ మంగళవారం కిటకిటలాడాయి. అర్ధరాత్రి నుంచే పలు ప్రార్థనా మందిరాల్లో క్రిస్మస్ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం కూడా పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

– సాక్షి బృందం



విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతున్న హిందూపురం సీఎస్ఐ మిషన్ చర్చి



మార్కెట్‌లో సందడి చేస్తున్న శాంటాక్లాజ్ బొమ్మ

ఉచిత గ్యాస్.. ఉత్తిదే!

» జిల్లాలోని ఓ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో మొత్తం 32 వేల గ్యాస్ కనెక్షన్లున్నాయి. అక్టోబరు 29వ తేదీ ప్రభుత్వం పంపిన జాబితా ప్రకారం 26 వేల మంది దీపం–2 పథకానికి అర్హత సాధించారు. అయితే ఆ తర్వాత నవంబరు 15న మరో జాబితా పంపించారు. అందులో 23 వేల మందికి మాత్రమే అర్హత ఉన్నట్లు పేర్కొన్నారు. సిక్స్ స్టెప్ వెరిఫికేషన్‌లో అర్హుల సంఖ్య తగ్గిందని సమాచారం ఇచ్చారు. దీంతో ఏజెన్సీ నిర్వాహకుడు వినియోగదారులకు ఏం చెప్పాలో తెలియక అల్లాడిపోతున్నాడు.

» పుట్టపర్తికి చెందిన ఓ వ్యక్తి అక్టోబరు 30వ తేదీన గ్యాస్ సిలిండర్ బుక్ చేశాడు. సిలిండర్ డెలివరీ అయ్యాక డబ్బులు చెల్లించాడు. వారంరోజులైనా బ్యాంకు ఖాతాలో నగదు జమ కాకపోవడంతో గ్యాస్ ఏజెన్సీని సంప్రదించాడు. కొత్తగా వచ్చిన జాబితాలో పేరు లేదని ఏజెన్సీ నిర్వాహకుడు చెప్పారు. అంతకుముందు ఉందన్నారు కదా అని ప్రశ్నించగా.. తమకు పైనుంచి వచ్చిన జాబితాలో పేరున్న వారికి మాత్రమే 'ఉచితం' వర్తిస్తుందని నిర్వాహకుడు సమాధానం ఇచ్చాడు.

- ఆరు నిబంధనలతో పథకాన్ని అటకెక్కిస్తోన్న కూటమి సర్కారు
- మొదట్లో అర్హత ఉన్నా.. తర్వాత లేదంటూ ప్రజలకు టోకరా
- అసలు విషయం తెలియక ఇబ్బందులు పడుతోన్న అమాయకులు
- ఆధార్, రేషన్ కార్డు ఉంటే చాలంటూ ఊదరగొట్టిన కూటమి నేతలు
- జిల్లాలో 10 శాతం మేర తగ్గిన దీపం–2 లబ్ధిదారుల సంఖ్య



8,08,483 జిల్లాలో గ్యాస్ కనెక్షన్ల సంఖ్య

6,32,517 అక్టోబరు 29వ తేదీ నాటికి దీపం -2 పథకానికి అర్హత సాధించిన కనెక్షన్లు

5,71,289 నవంబర్ 15వ తేదీ నాటికి దీపం- 2 పథకానికి అర్హత ఉన్న కనెక్షన్లు

61,228 రెండు వారాల వ్యవధిలో అర్హత కోల్పోయిన కనెక్షన్లు

3,10,097 డిసెంబరు 23 నాటికి డెలివరీ చేసిన సిలిండర్లు

సాక్షి, పుట్టపర్తి

'సూపర్ సిక్స్' పథకాల్లో మరో మోసం బయటపడింది. ఉచిత గ్యాస్ అంటూ ప్రచారం హోరెత్తించినా అమలులో మాత్రం కూటమి ప్రభుత్వం చతికిల బడింది. నిబంధనల పేరుతో అర్హుల సంఖ్యను భారీగా తగ్గించింది. కేవలం ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం ఉంటే చాలు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం వర్తిస్తుందని ఊదరగొట్టిన కూటమి పార్టీల నేతలు.. ఆ తర్వాత 'సిక్స్ స్టెప్స్' వెరిఫికేషన్ పేరుతో అర్హులను జాబితా నుంచి తొలగిస్తున్నారు.

అన్నీ కోతలే

కార్డు ఉంటే చాలు ఉచిత గ్యాస్ పథకం వర్తిస్తుందని కోతలు కోసిన నేతలు...ఆ తర్వాత మాట మార్చారు. తొలుత అక్టోబరు 29వ తేదీ అర్హుల జాబితాను వెలువరించారు. ఆ తర్వాత సరిగ్గా రెండు వారాల తర్వాత 10 శాతం మందిని అర్హుల జాబితా నుంచి తొలగించి మరో జాబితా పంపారు. ఈ విషయం తెలియని చాలా మంది లబ్ధిదారులు గ్యాస్ సిలిండర్ డెలివరీ అయ్యి వారం రోజులైనా బ్యాంకు ఖాతాలో నగదు ఎందుకు జమ కాలేదని గ్యాస్ ఏజెన్సీలను సంప్రదిస్తున్నారు. దీంతో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు 'మీరు అర్హులు కాదు' అని తేలుస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే సిక్స్ స్టెప్స్ వెరిఫికేషన్‌లో 'ఇనెలిజిబుల్' గా తేలారని చెబుతున్నారు. దీంతో కూటమి సర్కారు ఉచిత గ్యాస్ సిలిండర్ల విషయంలోనూ ప్రజలను మోసం చేస్తోందని స్పష్టంగా అర్థమైంది. ఇంకా ఈ విషయం తెలియని చాలా మంది గ్యాస్ ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణ చేస్తూనే ఉన్నారు.

'సిక్స్ స్టెప్స్'తో జాబితా నుంచి అవుట్

ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి కూటమి ప్రభుత్వం తాజాగా ఆరు నిబంధనలు విధించింది. 1. రేషన్‌కార్డు ఉండాలి. 2. ఆధార్ కార్డు ఉండాలి. 3. భూమి పది ఎకరాల్లోపు ఉండాలి. 4. నాలుగు చక్రాల వాహనం ఉండరాదు. 5. ఆధార్‌తో లింక్ అయిన బ్యాంకు ఖాతా ఉండాలి. 6. కుటుంబంలో ఒకరికే గ్యాస్ కనెక్షన్ ఉండాలి. కానీ దీపావళి పండుగ సమయంలో మాత్రం సాక్షాత్తూ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కేవలం ఆధార్, రేషన్, బ్యాంక్ పాస్ బుక్ ఉంటే చాలని చెప్పారు. కానీ ఇప్పుడు అంతా మార్చేశారు. సిక్స్ స్టెప్స్ వెరిఫికేషన్ తర్వాత నవంబరు 15వ తేదీ అర్హుల జాబితా గ్యాస్ ఏజెన్సీలకు పంపించారు. అందులో సుమారు 10 శాతం మేర కోత పడినట్లు తెలిసింది. దీంతో మొదట అర్హత ఉందని.. తర్వాత లేదని చెబుతుండటంతో సర్కారు ఏం చేస్తోందో ప్రజలకు అర్థం కావడం లేదు.



60 వేలకుపైగా కనెక్షన్లకు కోత

జిల్లాలో 8,08,483 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అక్టోబరు 29న ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రకటించిన రోజున.. అప్పటి నిబంధనల ప్రకారం జిల్లాలో దీపం -2 పథకం కింద 6,32,517 కనెక్షన్లు ఉండేవి. అయితే 'సిక్స్ స్టెప్స్' వెరిఫికేషన్ తర్వాత ప్రస్తుతం దీపం – 2 పథకం కింద 5,71,289 కనెక్షన్లకు అర్హత ఉన్నట్లు అధికారులు తేల్చారు. డిసెంబరు 23వ తేదీ నాటికి 3,10,097 సిలిండర్లు ఉచితంగా డెలివరీ చేసినట్లు చెబుతున్నారు. రెండు వారాల వ్యవధిలో సుమారు 61,228 మందిని దీపం–2 పథకం నుంచి తొలగించారు. దీనిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

రెండు వారాలైనా జమ కాలేదు



గత నవంబరులో గ్యాస్ బుక్ చేసుకున్నాం. రెండు రోజుల్లో డబ్బులు ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. నాలుగు రోజుల తర్వాత ఏజెన్సీలో కలిస్తే ఈ–కేవైసీ చేయించుకోవాలని చెప్పారు. ఈ–కేవైసీ చేయించి కూడా రెండు వారాలు దాటింది. అయినా ఇప్పటి వరకు గ్యాస్ సిలిండర్ కోసం చెల్లించిన డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ కాలేదు. – పార్వతమ్మ, ఏఆర్ రొప్పం గ్రామం, మడకశిర మండలం

నమ్మకం పోయింది



ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారం..ఉచిత గ్యాస్ సిలిండర్ పొందేందుకు మాకు అర్హత ఉంది. అందుకే సిలిండర్ బుక్ చేసి డబ్బులు కూడా చెల్లించాం. నెల రోజులు దాటినా.. ఇప్పటి వరకు బ్యాంకు ఖాతాకు నగదు జమ కాలేదు. ఈ–కేవైసీ కోసం ఏజెన్సీల చుట్టూ తిరిగినా ఎలాంటి సమాధానం చెప్పడం లేదు.

– సుశీలమ్మ, పెనుకొండ


నెలరోజులు తిప్పుకుని రాదన్నారు



నేను ధర్మవరం లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీ నుంచి గ్యాస్ సిలిండర్‌ను తీసుకున్నా. సబ్సిడీ బ్యాంకు ఖాతాకు జమ కాకపోవడంతో గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి అడిగితే డిసెంబర్ 1వ తేదీ తర్వాత బ్యాంకు ఖాతాకు జమ అవుతుందన్నారు. అయితే ఆ తర్వాత కూడా నగదు జమ కాలేదు. మళ్లీ వెళ్లి అడిగితే మీకు భూమి మూడు ఎకరాలు ఉందని, సబ్సిడీ రాదని సమాధానం ఇచ్చారు.

– షరాబ్ యోగానంద ఆచారి, బత్తలపల్లి

కూటమి బాదుడుపై పోరుబాట



పుట్టపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి ధర్నా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- 27న పుట్టపర్తిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ధర్నా
- విజయవంతానికి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపు

పుట్టపర్తి: తాము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామని గొప్పలు చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి రాగానే పేదల నడ్డివిరిచేలా కరెంటు చార్జీలు పెంచారని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన పుట్టపర్తి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాటతప్పిన చంద్రబాబు వైఖరికి నిరసనగా ప్రజల కోసం వైఎస్సార్ సీపీ పోరుబాట పట్టిందన్నారు. ఈ క్రమంలోనే వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 27వ తేదీన పుట్టపర్తిలోని గణేష్ సర్కిల్ వద్ద ఉన్న విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ధర్నా నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రతి ఒక్కరు పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏనాడూ విద్యుత్ చార్జీలు పెంచలేదని, ప్రజలపై ఎలాంటి అదనపు భారం మోపలేదన్నారు. కానీ చంద్రబాబు అధికారంలోకి రాగానే సర్దుబాటు పేరుతో ప్రజలపై రూ.15 వేల కోట్లు భారం మోపుతున్నారని, వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఒక్కహామీ నెరవేర్చలేకపోయారు

ఎన్నికల సమయంలో ప్రజలకు అలవిగాని హామీలిచ్చిన కూటమి పార్టీల నేతలు ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయారని దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మండిపడ్డారు. తల్లికి వందనం కింద ఇంట్లో ఎందరు పిల్లలు స్కూళ్లకు వెళితే వారందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, దాన్ని నేటికీ అమలు చేయలేకపోయారన్నారు. అలాగే రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేకపోయారన్నారు. మహిళలు, కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాలనూ మోసం చేశారని మండిపడ్డారు. అందువల్లే అందువల్లే ఆరు నెలల్లోనే ఈ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారన్నారు. రానున్న రోజుల్లో తప్పక బుద్ధి చెప్పి తీరుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి, ఎంపీపీ రమణారెడ్డి, పుట్టపర్తి పట్టణ, రూరల్, నల్లమాడ కన్వీనర్లు రంగారెడ్డి, నరసారెడ్డి, సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సాయిలీల, కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, అగ్రి అడ్వయిజరీ బోర్డు మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, మండల మాజీ కన్వీనర్ గంగాద్రి, పార్టీ నేతలు గోవర్ధన్‌రెడ్డి, సాయి, నారాయణరెడ్డి, బిల్డర్ మల్లికార్జున, శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తాం

- నూతన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఫిరోజ్‌బేగం



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ ఫిరోజ్‌బేగం

పుట్టపర్తి అర్బన్: నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా పనిచేస్తామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ ఫిరోజ్ బేగం తెలిపారు. మంగళవారం ఆమె ప్రశాంతి గ్రామంలోని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా వాయిల్పాడు సీహెచ్‌సీలో పని చేస్తున్న ఫిరోజ్‌బేగంకు ప్రభుత్వం పదోన్నతి కల్పించి జిల్లా నూతన డీఎంహెచ్‌ఓగా నియమించింది. ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓగా ఉన్న పెనుకొండ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణిని, తిరిగి తన పాత స్థానానికి పంపింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ ఫిరోజ్‌బేగం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తానన్నారు. వైద్యసేవలకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా... నేరుగా తనను సంప్రదించవచ్చన్నారు. అనంతరం ఆమె కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ టీఎస్ చేతన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

క్లుప్తంగా

ఎరువులు, యాజమాన్యంతో అధిక దిగుబడులు

- జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు



ఉలవ పంటను పరిశీలిస్తున్న జేడీఏ సుబ్బారావు

తాడిమర్రి: సేంద్రియ ఎరువుల వాడకం, సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే పంటల సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చునని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు సూచించారు. తాడిమర్రి మండలం మేడిమాకులపల్లి, తాడిమర్రి, ఎం.అగ్రహారం గ్రామాల్లో సాగు చేసిన కంది, ఉలవ పంటలను మంగళవారం ఆయన రైతులతో కలసి పరిశీలించారు. పంటల్లో దిగుబడి అంచనాలపై ఆరా తీశారు. సరైన సమయంలో చీడపీడల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఎం.అగ్రహారం గ్రామంలో రెయిన్‌ఫెడ్ ఏరియా డెవలప్‌మెంట్ పథకం కింద మంజూరు చేసిన వలసుమణి నూర్పిడి యంత్రాన్ని ధర్మవరం సహాయ సంచాలకుడు కృష్ణయ్యతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమాదేవి, రైతుసేవా కేంద్రం సిబ్బంది విజయ్, గౌతమి, నిజాముద్దీన్, ఎం.అగ్రహారం గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రమాదంలో వృద్ధుడి మృతి

లేపాక్షి: మండలలంటని చోళసముద్రం వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి నడుచుకుంటూ వెళుతున్న వృద్ధుడిని మినీ బస్సు ఢీకొంది. ఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నరేంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి హిందూపురంలోని మేళాపురం ప్రాంతానికి చెందిన నీరుగంటి అంజినప్ప (80)గా నిర్ధారించారు. లేపాక్షిలో ఉన్న తన కుమార్తెను చూసేందుకు వచ్చిన ఆయన సోమవారం రాత్రి నడుచుకుంటూ హిందూపురానికి వెళుతున్న సమయంలో ఘటన చోటు చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


మానవ హక్కుల పరిరక్షణ సమితి జోనల్ చైర్‌పర్సన్‌గా భారతి



గొర్తి భారతి

బత్తలపల్లి: అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి సౌత్ ఇండియా జోనల్ చైర్‌పర్సన్‌గా ధర్మవరానికి చెందిన గొర్తి భారతికి అవకాశం దక్కింది. ఈ మేరకు సమితి ఫౌండర్, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ హెచ్‌ఎండీ ముజాహిద్ నుంచి మంగళవారం ఉత్తర్వులు అందినట్లు ఆమె వివరించారు. తనపై నమ్మకంతో అప్పటించిన బాధ్యతలను సమర్థవంతం నెరవేరుస్తానని ఆమె పేర్కొన్నారు. జాతీయ అధ్యక్షుడి సహకారంతో మానవ హక్కుల పరిరక్షణకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

వాగులు ప్రవహించే చోట ఏర్పాటు చేసిన వంతెనలు పలు చోట్ల దెబ్బతిన్నాయి. అధికారులు తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారు. అవి కూడా ఏ క్షణాన కూలిపోతాయో.. నీటి ప్రవాహానికి ఎప్పుడు కోతకు గురవుతాయో తెలియడం లేదు. మూడు మార్గాల్లోని వంతెనలు ప్రమాదకర స్థితికి చేరాయి. కొత్త వంతెనలు ఏర్పాటు చేయకపోతే గ్రామీణ ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది.



కొడవండ్లపల్లి - గంగిరెడ్డిపల్లి వద్ద దెబ్బతిన్న వంతెన

వంతెన.. ప్రమాదాల చెంతన!

- మూడు చోట్ల దెబ్బతిన్న బ్రిడ్జీలు
- వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం
- శిథిలం కాకముందే మేల్కోవాలంటున్న ప్రజలు

ముదిగుబ్బ: అటు పల్లెకు.. ఇటు పల్లెకు వారధిలాంటి వంతెనల నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. శిథిల దశకు చేరుకుని అప్పుడో.. ఇప్పుడో అన్నట్టు ఉన్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ముదిగుబ్బ మండల పరిధిలో ముఖ్యంగా మల్లేపల్లికి వెళ్లే దారిలో రాచివారిపల్లి తండా వద్ద మద్దిలేరు వాగుపై గల వంతెన, కొడవండ్లపల్లి– గంగిరెడ్డిపల్లి మధ్యన గల మద్దిలేరు వాగుపై గల వంతెన, అలాగే దొరిగిల్లు సమీపాన ఉన్న వంతెన దెబ్బతిన్నాయి. మల్లేపల్లి, టీఎన్ పాళ్యం వైపు వెళ్లే రహదారిలో రాచివారిపల్లి తండా వద్ద మద్దిలేరు వాగుపై ఉన్న వంతెన పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ వంతెన మీదుగా 30 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కదిరి మండలం బట్రేపల్లి మీదుగా పులివెందుల, తలుపుల ప్రాంతాలకూ ఈ మార్గం మీదుగా వెళ్లవచ్చు. అలాంటి వంతెన భారీ వర్షాలకు కొట్టుకుపోవడంతో తాత్కాలికంగా రాకపోకల కోసం సిమెంట్ పైపులు, వేసి మట్టితో మరమ్మతులు చేశారు. శాశ్వత పరిష్కారం కోసం వాగుపై హైలెవల్ వంతెన ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆగిన కొడవండ్లపల్లి వంతెన నిర్మాణం

కొడవండ్లపల్లి – గంగిరెడ్డిపల్లి మధ్యన మద్దిలేరు వాగుపై ఏర్పాటు చేసిన వంతెన గతంలో భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. ఈ వంతెన మీదుగా 20 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల వంతెన దెబ్బతిన్న చోట సిమెంట్ పైపులు వేసి మట్టిని తోలారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వంతెన మరమ్మత్తుల కోసం రూ.2.97 కోట్లు మంజూరు చేయించారు. అయితే భారీ వర్షాల కారణంగా కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయలేకపోయారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పనులకు బ్రేక్ పడింది. వంతెన పనులు పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

దొరిగిల్లు వంతెన

మండల కేంద్రం ముదిగుబ్బకు సమీపాన దొరిగిల్లు వద్ద ఉన్న పల్లపు వంతెన భారీ వర్షాలకు, అలాగే వైవీఆర్ గేట్లు ఎత్తినపుడు వంతెనపై నాలుగు మీటర్ల ఎత్తుతో నీరు ప్రవహిస్తుంది. రెండు రోజుల పాటు నీటి ఉధృతి తగ్గకపోవడం వల్ల వాహన రాకపోకలు ఆగిపోతాయి. ఈ వంతెనకు ప్రత్యామ్నాయ దారి లేక అటు వైపు వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ వంతెన మీదుగా 20 గ్రామాల ప్రజలతో పాటు పులివెందులకు వెళ్లే బస్సులు కూడా వెళ్తుంటాయి. ఇక్కడ పటిష్టమైన హైలెవల్ వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



గంగిరెడ్డి పల్లి వద్ద దెబ్బ తిన్న వంతెన



రాచివారిపల్లి వద్ద దెబ్బతిన్న వంతెన



దొరిగిల్లు వద్దనున్న పల్లపు వంతెన

భారీ వర్షాలొస్తే ఇబ్బందులే



కొడవండ్లపల్లి– గంగిరెడ్డిపల్లి మధ్యన ఉన్న మద్దిలేరు వాగుపై నిర్మించిన వంతెన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. తాత్కాలికంగా వేసిన వంతెన కూడా వర్షాలు వస్తే నిలబడదు. ప్రజలందరికీ ఇబ్బందులే. ఈ వంతెనకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది.

– వెంగళరెడ్డి, బూదనంపల్లి సర్పంచ్

శాశ్వత పరిష్కారం చేయాలి



దొరిగిల్లు సమీపంలోని మద్దిలేరుపై పల్లపు వంతెన వైవీఆర్ గేట్లు ఎత్తిన రోజు వాహన రాకపోకలకు పూర్తి స్థాయిలో అంతరాయం కలుగుతుంది. ఈ వంతెనకు శాశ్వత పరిష్కారంగా హైలెవల్ వంతెనను నిర్మించాల్సిన అవసరం ఉంది.

– ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్, ఈదులపల్లి

నీటి ఉధృతి తగ్గితే పనులు చేపడతాం

కొడవండ్లపల్లి – గంగిరెడ్డిపల్లి మధ్య మద్దిలేరు వాగుపై ఉన్న వంతెన వర్షాలకు దెబ్బతింది. గత ప్రభుత్వం మరమ్మతుల కోసం రూ.2.97 కోట్లు మంజూరు చేసింది. అయితే వర్షాలు, ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

– గిరి, డీఈ, ఆర్‌అండ్‌బీ

ప్రతిపాదనలు పంపాం

రాచవారిపల్లి తండా వద్ద మద్దిలేరు వాగుపై హైలెవల్ వంతెన కోసం రూ.7.45 కోట్లు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే వంతెన పనులను చేపడతాం.

– రాజేంద్రప్రసాద్, జేఈ, పీఆర్

సోలార్ రూఫ్ టాప్‌తో విద్యుత్ బిల్లుల ఆదా

- మంత్రి సత్యకుమార్



సోలార్ విద్యుత్ ప్లాంట్ నమూనాను పరిశీలిస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం అర్బన్: సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు ఆదా చేయవచ్చునని మంత్రి సత్యకుమార్ అన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనపై స్థానిక ఆర్డీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి... అక్కడ ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ నమూనాను ప్రారంభించి, మాట్లాడారు. ఇంటి పైకప్పుపై కనీసం 10 చ.మీ లేదా 100 చ.అ స్థలంలో 1 కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే ఇంటి విద్యుత్ అవసరాలు తీరుతాయన్నారు. తద్వారా సంప్రదాయ విద్యుత్ బిల్లు తగ్గే అవకాశముందన్నారు. పర్యావరణ అనుకూలమైన శక్తిని ఉపయోగించి విద్యుత్ వృథాను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పాల్గొన్నారు.

డయాలసిస్ సెంటర్ ప్రారంభం

డయాలసిస్ సెంటర్ ఏర్పాటుతో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఊరట దక్కుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ధర్మవరంలోని దుర్గానగర్ మాతాశిశు ఆస్పత్రిలో మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ధర్మవరం పట్టణంతోపాటు చుట్టుపక్కల మండలాల ప్రజలకు అనుకూలంగా ఉండేలా 5 మిషన్లతో కూడిన డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డయాలసిస్ స్టేట్ మోడల్ ఆఫీసర్ నిర్మలాగ్లోరి, డీఎంహెచ్‌ఓ ఫైరోజు బేగం, డీసీఐహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీదేవి, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, వైద్యులు వివేక్, ఏఓ ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

301 సెల్‌ఫోన్ల రికవరీ



సెల్‌ఫోన్ల అందజేస్తున్న ఎస్పీరత్న

పుట్టపర్తి టౌన్: జిల్లాలో చోరీకి గురైన 301 సెల్‌ఫోన్లను జిల్లా పోలీసులు రికవరీ చేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ రత్న స్వయంగా బాధితులకు వాటిని అప్పగించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రత్న మాట్లాడారు. చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గడచిన కొద్ది రోజులుగా జిల్లా వ్యాప్తంగా చోరీకి గురైన రూ.40 లక్షలు విలువైన 301 సెల్‌ఫోన్లు రికవరీ చేశామన్నారు. స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్ఐ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ఐటీకోర్ సిబ్బంది 10 మంది సహకారంతో సెల్‌ఫోన్‌లు రికవరీ చేశామన్నారు. అనంతరం సెల్‌ఫోన్లు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే 'సీఈఐఆర్' వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. లేకపోతే 6305800426 నంబర్‌కు వ్యాట్సాప్‌లో హాయ్ అని లేదా హెల్ప్ అని మెసేజ్ పంపి అందులో అడిగిన సమాచారాన్ని పొందుపరిస్తే రికవరీకి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనవాసులు, సీసీఎస్ టీం సభ్యులు చంద్ర, కిరణ్‌కుమార్ రెడ్డి, రహిమాన్, శేఖర్, రవి, నారాయణస్వామి, విశ్వనాథ్, సుదర్శన్‌రెడ్డి, గంగాధర్‌తో పాటు పోలీస్ సిబ్బంది, బాధితులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖకు కంప్యూటర్ల అందజేత



ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేసీ అభిషేక్ కుమార్ (చిత్రంలో) కలెక్టర్ టీఎస్ చేతన్, తదితరులు

ప్రశాంతి నిలయం: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా పలు సంస్థలు వివిధ బ్యాంక్‌ల ద్వారా సమకూర్చిన కంప్యూటర్లు, ప్రింటర్లను సాంఘిక సంక్షేమ అధికారి శివరంగ ప్రసాద్‌కు మంగళవారం కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్, ఎల్‌డీఎం రమణకుమార్ మంగళవారం అందజేశారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు కంప్యూటర్ విద్యను చేరువ చేయాలని సూచించారు.

నేడు ప్రశాంతి నిలయంలో క్రిస్మస్



క్రిస్మస్ క్యారల్స్ ఆలపిస్తున్న విదేశీ భక్తులు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయం వేదికగా బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి సత్యసాయి అంతర్జాతీయ సేవా సంస్థలకు చెందిన భక్తులు ప్రశాంతి నిలయంలో చేరుకుని ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మంగళవారం సాయంత్రం సత్యసాయి మహాసమాధి చెంత 300 మంది విదేశీ భక్తులు క్రిస్మస్ క్యారల్స్ ఆలపించారు.

పాలీహౌస్‌ల ద్వారా నాణ్యమైన దిగుబడులు : కలెక్టర్



కొడికొండ సమీపంలోని పాలీహౌస్‌లో సాగు చేసిన గులాబీతోటను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

చిలమత్తూరు: పాలీహౌస్‌ల ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధ్యమవుతాయని రైతులకు కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. మంగళవారం ఆయన కొడికొండ సమీపంలోని చిత్రావతి నది ఒడ్డున రైతు అజీముల్లా తన పాలీహౌస్‌లో సాగు చేస్తున్న వివిధ రకాల గులాబీ చెట్లు, కోల్డ్ స్టోరేజీ యూనిట్‌ను పరిశీలించారు. పాలీహౌస్ నిర్మాణం, పూల తోట సాగు, యాజమాన్య పద్ధతులు, కోల్డ్ స్టోరేజీలో నిల్వ, ఎగుమతి వంటి అంశాలను రైతును అడిగి తెలుసుకున్నారు. రైతు అజీముల్లా మాట్లాడుతూ, ఉద్యానవనశాఖ అందించిన రాయితీతో రెండున్నర ఎకరాల్లో షెడ్ నెట్, పాలీహౌస్ నిర్మాణం చేపట్టి ఎకరం విస్తీర్ణంలోనే 30 వేల గులాబీ మొక్కలు నాటి మంచి దిగుబడి సాధించినట్లు తెలిపారు. ఎకరం విస్తీర్ణంలో ఆరు నుంచి ఏడు లక్షల పూల దిగుబడి వస్తుండగా, రూ.9 లక్షల నికర ఆదాయం గడిస్తున్నట్లు వివరించారు. వర్షపు నీరు వృథా కాకుండా నిల్వ ఉంచి ఆ నీటినే తోటలకు వాడుతుండటాన్ని గమనించిన కలెక్టర్ రైతును అభినందించారు. కలెక్టర్ వెంట ఉద్యానవనశాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ చంద్రశేఖర్, మండల ఉద్యానాధికారి మహేష్ నాయక్, తదితరులు ఉన్నారు.

27న ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక

బత్తలపల్లి: స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానంలో ఈ నెల 27న ఉమ్మడి జిల్లా జూనియర్స్ బాలబాలికల కబడ్డీ జట్లకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు జిల్లా కబడ్డీ అసోషియేషన్ అధ్యక్షుడు ఆర్.రామ్‌తేజ్‌గౌడ్, ఉపాధ్యక్షుడు సంపత్‌కుమార్, కార్యదర్శి రాగిరి రామయ్య మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బాలుర బరువు 70 కేజీలు, బాలికల బరువు 65 కేజీల లోపు ఉండాలి. పదో తరగతి ఒరిజనల్ మార్కుల జాబితా, ఆధార్‌కార్డు ఒరిజనల్ వెంట తీసుకెళ్లాలి. ఎంపికైన వారు జనవరి 3నుంచి 5వ తేదీ వరకూ కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ఉమ్మడి జిల్లా తరపున ప్రాతినిథ్యం వహించాల్సి ఉంటుంది.

27న వాలీబాల్ జట్ల ఎంపిక

పుట్టపర్తి టౌన్: వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (అడహక్ కమిటీ) ఆధ్వర్యంలో జనవరి 7 నుంచి 13వ తేదీ వరకూ రాజస్తాన్‌లోని జైపూర్ వేదికగా జరిగే జాతీయ స్థాయి మహిళా, పురుషుల వాలీబాల్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్ల ఎంపికను ఈ నెల 27న విజయవాడలో చేపట్టనున్నారు. ఈ మేరకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఉదయ భాస్కర్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్ కార్డు, నేటివిటీ సర్టిఫికెట్, 10 ఫొటోలతో ఈ నెల 27న ఉదయం 7గంటలకు విజయవాడలోని మున్సిపల్ స్టేడియానికి చేరుకోవాలి. పూర్తి వివరాలకు ఓంప్రకాష్ (92817 47940) సంప్రదించవచ్చు.

యువకుడి అదృశ్యం



శివప్రసాద్

బత్తలపల్లి: వైఎస్సార్ జిల్లా పులివెందులలోని నగరిగుట్టకు చెందిన యువకుడు తమ్మిశెట్టి శివప్రసాద్ కనిపించకుండా పోయాడు. రెండు రోజుల క్రితం బత్తలపల్లిలోని తన అక్క, బావ అర్చన, ఆంజనేయులు ఇంటికి శివప్రసాద్ వచ్చినట్లు తండ్రి తమ్మిశెట్టి రామాంజినేయులు తెలిపారు. ప్రేమ విషయంగా అమ్మాయి బంధువులతో గొడవపడి వచ్చిన శివప్రసాద్ కనిపించకపోవడంతో మంగళవారం బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు.

కనిపించకుండా పోయిన ఇంజినీరింగ్ విద్యార్థిని

రాప్తాడు రూరల్: ఇంజినీరింగ్ విద్యార్థిని కనిపించకుండా పోయింది. పోలీసులు తెలిపిన మేరకు... సోమందేపల్లి మండలానికి చెందిన ఓ విద్యార్థిని ఎస్కేయూ సమీపంలోని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్‌లో ఉంటూ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం పీవీకేకే కళాశాలలో తనకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి తల్లి, సోదరుడితో కలిసి వెళ్లింది. అనంతరం బయటకు వెళ్లిన తల్లి, సోదరుడు పరీక్ష ముగిసే సమయానికి అక్కడికి చేరుకున్నారు. విద్యార్థులందరూ బయటకు వెళ్లినా కూతురు రాకపోవడంతో లోపలకు వెళ్లి ఆరా తీశారు. విద్యార్థులందరూ బయటకు వెళ్లిపోయారని యాజమాన్యం తెలపడంతో తల్లి వెంటనే అనంతపురం రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు కళాశాల గేట్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించారు. అందులో పరీక్ష ముగిసేందుకు గంట ముందే సదరు విద్యార్థిని బయటకు వచ్చి ఆటోలో వెళ్లినట్లు గుర్తించారు. ఆటో డ్రైవరును విచారించగా...ఆర్టీసీ బస్టాండ్ వద్ద డ్రాప్ చేసినట్లు తెలిపాడు. ఆటో దిగిన విద్యార్థిని తర్వాత ఎటు వెళ్లిందనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

కుప్పకూలిన ఆంధ్రా జట్టు

- పేలవమైన ఆటతీరుతో కేవలం 143 పరుగులకే ఆలౌట్
- అర్ధసెంచరీతో రాణించిన వరుణ్ సాత్విక్



ఆంధ్ర, మహారాష్ట్ర జట్ల మధ్య మ్యాచ్

అనంతపురం: మహారాష్ట్ర బౌలర్ల ధాటికి ఆంధ్ర బ్యాటర్లు కుప్పకూలారు. అనంత క్రీడాగ్రామం వేదికగా బీసీసీఐ, ఏసీఏ సంయుక్తంగా నిర్వహిస్తున్న అండర్-19 కూచ్‌బెహర్ ట్రోఫీలో భాగంగా ఆంధ్ర, మహారాష్ట్ర జట్ల మధ్య నాలుగు రోజుల మల్టీడే మ్యాచ్‌లు జరుగుతున్న విషయం తెలిసిందే. 69/3తో ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ మూడో రోజు ఆట ప్రారంభించిన ఆంధ్ర జట్టు 63.5 ఓవర్ల వద్ద 143 పరుగులకు ఆలౌట్ అయింది. మహారాష్ట్ర లెగ్ స్పిన్నర్ శుభం కాదమ్ తన మాయాజాలంతో ఆంధ్రను తక్కువ స్కోరుకే కట్టడి చేశాడు. 39 పరుగులు ఇచ్చి ఆరు వికెట్లు కూలదోశాడు. ఆంధ్ర బ్యాటర్లలో వరుణ్‌సాత్విక్ (50), లోహిత్ లక్ష్మీనారాయణ 28 పరుగులతో ఆకట్టుకున్నారు. కాగా, మహారాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 420 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. దీంతో 277 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతతో మూడో రోజు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన మహారాష్ట్ర జట్టు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 174 పరుగులు చేసింది. జట్టులో సుప్రాత్ సావంత్ (56) నాటౌట్‌గా నిలిచాడు. నీరజ్ జోషి 38, కిరణ్ చోర్మాలే 22 పరుగులు చేశారు. కాగా, బుధవారం చివరి రోజు కావడంతో మ్యాచ్ డ్రా గా ముగిసే అవకాశం ఉంది. ఈ క్రమంలో పాయింట్ల ప్రాతిపదికన అగ్రస్థానంలో ఉన్న మహారాష్ట్ర జట్టు సెమీ ఫైనల్ దిశగా దూసుకెళుతోంది.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ చాటిన ఎస్కేయూ విద్యార్థులు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎస్కేయూ రెక్టార్ జి.వెంకటనాయుడు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాక్, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీ ఆధ్వర్యంలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 118 మందికి ఉద్యోగాలు దక్కాయి. రేవాటెక్‌లో 40 మంది, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్‌లో 30 మంది, ఐ-సన్ టెక్నాలజీస్‌లో 35, టీసీఎస్ (నాన్-ఐటీ)13 మంది ఉద్యోగాలు దక్కించుకున్నారు. మొత్తం 220 మంది హాజరుకాగా, 118 మంది ఉద్యోగాలకు ఎంపికపై రెక్టార్ జి. వెంకటనాయుడు, రిజిస్ట్రార్ ఈ.రమేష్‌బాబు, డీఎస్‌డీఓ ప్రతాప్ రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అనిత, ఎంబీఏ విభాగాధిపతి మురళీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

మోసపూరిత ప్రకటనలు నమ్మకండి : జేసీ



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: మోసపూరిత ప్రకటనలపై అప్రమత్తంగా ఉండాలని, వివిధ మాధ్యమాల ద్వారా వచ్చే వ్యాపార ప్రకటనలను విశ్లేషించుకుని తుది నిర్ణయం తీసుకోవాలని వినియోగదారులకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ మందిరంలో మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జేసీ... వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. వినియోగదారుల చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ-కామర్స్, డిజిటల్ లావాదేవీలు చేసేటప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. ఉచిత బహుమతులు, డిస్కౌంట్ల మాయాజాలంలో చిక్కుకోరాదన్నారు. వినియోగదారులు తాము కొన్న వస్తువులు, పొందిన సేవల విషయంలో మోసపోతే జిల్లా వినియోగదారుల ఫోరం, రాష్ట్ర వినియోగదారులు వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చునన్నారు. అనంతరం వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ తిప్పయ్య, ఫుడ్ సేఫ్టీ అధికారి గణేష్ బాబు, తూనికలు కొలతల అధికారి శివశంకరయ్య, ఆర్టీసీ డిపో మేనేజర్ ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.